లింగంపల్లి - ఘట్‌కేసర్ మధ్య నేటి నుంచి ఎంఎంటీఎస్ సర్వీసు ప్రారంభం

ఖైల్‌కాలనీ/కుషాయిగూడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నేడు నగరంలో లింగంపల్లి - ఘట్‌కేసర్‌ల మధ్య ఎంఎంటీఎస్ రైలు సేవలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ప్రతిరోజూ తొమ్మిది బోగీలతో గల ఎంఎంటీఎస్ రైలు రెండు ట్రిప్పులు తిరిగే విధంగా ఏర్పాటు చేశారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా రైలు ట్రిప్పులను పెంచుతామని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

ఎంఎంటీఎస్ సమయం వివరాలు..

ప్రారంభం సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్ నుంచి ఉదయం 10.45కి ఎంఎంటీఎస్ బయలుదేరి చర్లపల్లికి 10.59గంటలకు, నేరేడ్‌మెట్‌కు 11.21కి, అమ్ముగూడకి 11.29కి, భూదేవీనగర్‌కు 11.36కి, సుచిత్ర సెంటర్‌కు 11.45కి, ఫిరోజ్‌గూడ 11.54కు, భరత్‌నగర్ 12.03కు, బోరబండ 12.07కు, హైటెక్‌సిటీకి 12.12, హఫీజ్‌పేట్‌కి 12.18, చందానగర్‌కి మధ్యాహ్నం 12.23, లింగంపల్లికి 12.40కి చేరుతుంది.

'శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి'

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి ఈ నెల 6 నుంచి ఆరు రోజుల పాటు కీసరగుట్టపై జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం కీసరగుట్టలోని కల్యాణ మండపంలో ఆయా శాఖల అధికారులతో, ప్రజాప్రతినిధులతో, ఆలయ కమిటీ సభ్యులతో కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ దాదాపు 1800 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారని, 56 సీసీ కెమెరాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉచిత బస్సు సౌకర్యాంలో భాగంగా 300 బస్సులు జాతరకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు కలెక్టర్ గౌతమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి కీసరగుట్ట క్షేత్రంపై కలియతిరిగారు.

అపోలో ఆస్పత్రిలో మహిళకు కార్-టీ సెల్ థెరపీ

హైదరాబాద్ సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగికి కార్ - టీ సెల్ థెరపీని నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన 50 ఏళ్ల మహిళా రోగి కొంతకాలంగా మల్టీపుల్ మైలోమా (బ్లడ్ కేన్సర్ కండిషన్)తో బాధపడుతున్నది. ఆమె ఇటీవల అపోలో కేన్సర్ సెంటర్ వైద్యుల వద్దకు రాగా, ఆమెకు వైద్య పరీక్షలు చేసి కేవలం కార్-టీ థెరపీ ద్వారానే చికిత్స అందించడానికి అవకాశముందని నిర్ధారించుకుని వైద్య ప్రక్రియను ప్రారంభించారు. చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ టీ-సెల్ (కార్-టీ) థెరపీని విజయవంతంగా నిర్వహించి కేన్సర్ చికిత్సలో అపోలో ఆస్పత్రి మరో మైలురాయిని చేరుకుందని అపోలో కేన్సర్ సెంటర్ హెమటాలజిస్ట్, బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ పద్మజ లోకిరెడ్డి చెప్పారు. అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడంలో తమ ఆస్పత్రి ముందంజలో ఉంటున్నదన్నారు.

24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య



ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 24వేల టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో టెట్‌తోపాటు 24వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ సాధనకోసం మహాధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లను ఒకేసారి వేయడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరాలు ఏమిటని ప్రశ్నించారు. ఇరవై సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఐదువేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ టీచర్‌తోపాటు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించి భర్తీ చేయాలన్నారు. బీసీ యువజన సంఘంరాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షత జరిగిన ధర్నాలో బీసీ నేతలు గువ్వల భరత్, నందగోపాల్, రామకృష్ణ, నరసింహా గౌడ్, పోతులారం కృష్ణ ప్రీతమ్, రాందేవ్, ఉదయ్, సతీష్, నిఖిల్, రఘుపతి, కరుణశ్రీ జయంతితోపాటు పెద్ద ఎత్తున నిరుద్యోగులు పాల్గొన్నారు.

'ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు వేతనాలు పెంచాలి'

హైదరాబాద్ సిటీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేతనాలను పెంచాలని కోరుతూ తెలంగాణ రెండో వేతన సవరణ కమిషన్ కమిషనర్ శివశంకర్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాడర్‌కు గత వేతన సవరణల్లో జరిగిన అన్యాయాలపై పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని వేతనసవరణ కమిషన్‌ను కోరారు. ల్యాబ్ టెక్నీషియన్లకు వృత్తిపరంగా ఉన్న రిస్క్ ఫ్యాక్టర్స్ వల్ల కలిగే జీవితకాల ఆరోగ్య ప్రమాదాలకై, విద్య, వైద్యం కోసం ప్రత్యేక అలవెన్సు మంజూరీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు హరినాథ్, ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ సలీం, కార్యదర్శి రమేష్, బురాన్, వేణుగోపాల్, భాస్కర్, సునీత, ప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడంతస్తుల మేడపైనుంచి పడి వృద్ధురాలి మృతి



శారద బెన్ (ఫైల్)

రాజేంద్రనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉతికిన దుస్తులు ఆరేస్తూ మూడంతస్తుల మేడ పైనుంచి కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. రాజేంద్రనగర్ సర్కిల్ భవానీ కాలనీలో ఇతీష్ కుమార్ కుటుంబం నివాసం ఉంటున్నది. సోమవారం ఇంట్లోని వారంతా పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఇతీష్‌కుమార్ తల్లి శారద బెన్(70) మూడంతస్తుల భవనంపై దుస్తులు ఆరవేస్తుండగా కళ్లు తిరిగి పై నుంచి కింద పడింది. మృతిచెందింది. శబ్దం రావడంతో నాలుగో అంతస్తులోని భావన పటేల్ బయటకు వచ్చి చూసి ఇతీష్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఇతీష్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ భానుప్రకాశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

నగరంలో టానిక్ లిక్కర్స్ సెంటర్లలో వాణిజ్య పన్నుల శాఖ సోదాలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న టానిక్ లిక్కర్స్ గ్రూప్‌నకు చెందిన షాపులు, వాటి అనుబంధ సంస్థలలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి రాత్రి 11గంటల వరకు కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీలతో పాటు నగరంలో సుమారు 10చోట్ల సోదాలు నిర్వహించారు. షాపుల్లో ఉన్న బ్రాండ్స్‌కు సంబంధించి కొనుగోలు వివరాలు.. ఎప్పుడు ఆర్డర్ ఇచ్చారు.. ఎక్కడి నుంచి సరఫరా అయింది? వాటికి సంబంధించిన లేబుల్స్ వివరాలను సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు వివరించిన తర్వాత తదుపరి చర్యలుంటాయని అధికారులు పేర్కొన్నారు.

విదేశాలకు తల వెంట్రుకలు ఎగుమతిలో అక్రమాలు

- ఈడీ ప్రాసిక్యూషన్ ఫిర్యాదును అనుమతించిన కోర్టు

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు తల వెంట్రుకలు(జుట్టు) ఎగుమతి చేసి కోట్ల రూపాయలు అక్రమాలకు పాల్పడ్డ కేసులో ఈడీ దాఖలు చేసిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును కోర్టు అనుమతించింది. జుట్టు అక్రమ ఎగుమతులపై ఈడీ నైల ఫ్యామిలీ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌కు చెందిన 17 మందిపై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఇందుకు సంబంధించిన ప్రాసిక్యూషన్ ఫిర్యాదును గత ఆగస్టు 21న నాంపల్లి పీఎంఎల్‌ఏ ప్రత్యేక న్యాయస్థానంలో దాఖలు చేసింది. ఈ ఫిర్యాదును కోర్టు ఇటీవలే అనుమతించినట్లు ఈడీ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ వెంట్రుకలను మిజోరం వద్ద భూమార్గంలో మయన్మార్, చైనా, బంగ్లాదేశ్, వియత్నాంకు ఎగుమతి చేసినట్లు లభించిన ఆధారాల మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ పలు ప్రాంతాల్లో జరిపిన సోదాల్లో రూ. 1.21 కోట్లు లెక్కలోలేని నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు బ్యాంకు ఖాతాల్లోని రూ. 7.85 కోట్లు ఫ్రీజ్ చేసింది.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ముషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని రవాణా శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.57 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను, సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డి) సంస్థ సహకారంతో డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 కోట్ల రూపాయలతో నిర్మించిన ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనబడి, మనబస్తీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేసి మెరుగైన విద్యను అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందన్నారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి నిధులందించిన డాక్టర్ విజయ్‌కుమార్ దాట్ల ఫౌండేషన్‌ను అభినందించారు. ఇలాంటి సంస్థలు ప్రభుత్వానికి, పేదలకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో ఇప్పటివరకు 288 బస్తీదవాఖానాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్ గౌసుద్దీన్, డీఈవో రోహిణి, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి, డాక్టర్ విజయకుమార్ దాట్ల ఫౌండేషన్ ట్రస్టీ, బీఈ కంపెనీ డైరెక్టర్ ఇందిర, ఫౌండేషన్ కమిటీ చైర్మన్ ఐ.వి. కృష్ణారావు, ఎస్ఆర్‌డి సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాళ్‌రెడ్డి, పూస గోరక్‌నాథ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం బి-బ్లాక్ కన్వీనర్ పట్నం నాగభూషణం గౌడ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు మేడి సురేష్‌కుమార్, మోహిన్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, ఆర్.కల్పనాయాదవ్, ఆసుపత్రి ఎస్‌పీహెచ్‌వోలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, వైద్యాధికారులు డాక్టర్ దీప్తి ప్రియాంక, డాక్టర్ అనిల్, పిహెచ్ఎన్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

బ్యానర్‌లో ఫొటో లేదని కార్పొరేటర్ ఆగ్రహం

పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన బ్యానర్‌లో తన ఫొటో లేకపోవడంపై భోలక్‌పూర్ కార్పొరేటర్ గౌసుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు బ్యానర్‌ను తొలగించడంతో గొడవ సద్దుమణిగింది.

గృహజ్యోతి జీరో విద్యుత్ బిల్లుల పంపిణీ

గృహజ్యోతి పథకంలో భాగంగా సోమవారం ముషీరాబాద్‌లోని దళిత జాతీయ సంఘం వీధిలో మంత్రి పొన్నం ప్రభాకర్ జీరో విద్యుత్ బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. జీరో విద్యుత్ బిల్లుల జారీపై మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యుత్ శాఖ మెట్రోజోన్ సీజీఎం నర్సింహస్వామి, ఏఎస్ఈ బ్రహ్మం, డీఈ కమల్‌కుమార్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈలు శాంతారాం, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.500 కోట్ల బడ్జెట్‌తో గల్ఫ్‌సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బహుజన ముక్తి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర నాయకులు దేవతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గల్ఫ్ సంక్షేమ బోర్డు సాధన కోసం రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన అంసోల్‌లక్ష్మణ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బహుజన ముక్తి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వలిగె ప్రభాకర్, బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ధర్మయ్య, ఉపాధ్యక్షులు జి.శ్యామల్ రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి ఉప్పులేటి రాజేందర్, నాయకులు మేకల దాసు, కీర్తి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణాకేంద్రాలు మహిళాసాధికారతకు దోహదం

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మహిళాసాధికారత, ఆర్థికాభివృద్ధికి శిక్షణాకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, వీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం డివిజన్‌లోని వీవీగిరినగర్‌లోని నూతన కమ్యూనిటీహాల్‌లో ఆమె ప్రారంభించారు. కార్పొరేటర్ పావని స్వయంగా అందజేసిన 10 కుట్టుమిషన్లతో శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరీష్‌రెడ్డి, అధ్యక్షుడు మధు, ప్రాజెక్ట్ చైర్మన్ శేరిపల్లి గణేష్ పద్మశాలి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని గాడిలో పెట్టాలి

- కార్పొరేట్ విద్యా సంస్థలను రద్దు చేయాలి
- పీడీఎస్‌యూ రౌండ్‌టేబుల్‌లో వక్తలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.కోదండరాం

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని గాడిలో పెట్టాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ప్రొఫెసర్ ఎం.కోదండరాం, విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక నాయకులు ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి పేద విద్యార్థులను శారీరకంగా, మానసికంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లు, హస్టల్స్, కళాశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని మరింత పెంచాలన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ నోటిఫికేషన్ ఇచ్చే విధంగా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీ.శ్రీకాంత్, ఏఐడీఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు మమత, జిన్నారపు రాజేశ్వర్, గడ్డం శ్యామ్, ఖానాపురం రాజేష్, అశోక్, ఆసిఫ్, గణేష్, గౌతమ్, షరణ్, సంతోష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గారెడ్డికి జాతీయ సేవారత్న అవార్డు

రాంనగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంఘ సేవకుడు, ఫ్యామిలీ కౌన్సిలర్ బి.దుర్గారెడ్డికి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సేవారత్న అవార్డు దక్కింది. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా దుర్గారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

కిషన్‌రెడ్డిని తిరిగి గెలిపించుకుంటాం

చిక్కడపల్లి,మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కిషన్‌రెడ్డిని సికింద్రాబాద్ లోక్‌సభ ఎంపీగా తిరిగి గెలిపించుకుంటామని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. జాయింట్ కన్వీనర్‌గా వినయ్‌కుమార్ ఎంపికైనందుకు సోమవారం గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆయనను కలిసి అభినందించారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించండి

గోల్నాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీలోకి ప్రవేశించే రెండు మార్గాలలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, అక్రమ పార్కింగ్ తో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, చైర్మన్ ఎ.రామాగౌడ్, ప్రధానకార్యదర్శి బి.మధుసూధనాచారి జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వారు జీహెచ్ఎంసీ అసిస్టెంట్ కమిషనర్, బి.రవీందర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ టి.వేణుకు వినతిపత్రం అందజేశారు.

మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావులు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని శ్రీమహంకాళి దేవాలయంలో ప్రధాని మోదీ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నగర కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, బీజేపీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కృష్ణగౌడ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలరాజు సేవలు వెలకట్టలేనివి : బీజేపీ

అంబర్‌పేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి దివంగత ఆనెం బాలరాజు చేసిన సేవలు వెలకట్టలేనివని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ అన్నారు. బాలరాజు వర్ధంతి కార్యక్రమం సోమవారం అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నిర్వహించారు. బాలరాజు చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగభూషణంచారి, మైలారం రాజు, యశ్వంత్, గరికబోయిన మల్లేష్, సీ.హెచ్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ మహాశివరాత్రి ప్రసంగం ప్రారంభం

చిక్కడపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ కేంద్రం ఆధ్వర్యంలో విశ్లేషణాత్మక ప్రసంగ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శ్రీమద్భగవద్గీత, రాజయోగ అనుభూతి విషయంపై గీతాతత్వ నిపుణులు, ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ రాజయోగి బీకే త్రినాథ్ ప్రవచనం చెప్పారు. కేంద్రం హెడ్ జయశ్రీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

నల్లకుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పొందడానికి బ్యాంకుల ద్వారా మంజూరైన చెక్కులను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి సూచించారు. సోమవారం నల్లకుంటలో మహిళా పొదుపు సంఘం మహిళల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్, సంజీవయ్యనగర్‌లోని నాలుగు పొదుపు సంఘాలకు మంజూరైన రూ. 21 లక్షల చెక్కులను కావ్యకిషన్‌రెడ్డి, కార్పొరేటర్ యాకర.అమృత అందజేశారు.



ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌కు సత్కారం

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌ను సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వరదరాజు గద, గజమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్, విజయ్‌యాదవ్, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్‌ను ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గౌస్, యాదగిరి పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ముషీరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాజపేట చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అల్పాహార పంపిణీ కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు, స్కూల్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ..

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలో కొనసాగుతున్న కార్మిక విద్యస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ బ్లూ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ నల్లా సంతోష్, మాజీ అధ్యక్షురాలు కల్పన ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష ప్యాడ్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమానికి మాజీకార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

గృహజ్యోతిపై ప్రజల హర్షం: శంభుల

రాంనగర్: సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలలో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ జీరో బిల్లు పట్ల రాష్ట్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీలు తెలిపారు. సోమవారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని సాయిబాబానగర్‌లో వారు పర్యటించారు.

మంత్రిని కలువకుండా అడ్డుకున్న పోలీసులు

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తమ ఇళ్లు అక్రమంగా కూల్చేశారంటూ గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీవాసులు సోమవారం నిరసన తెలుపుతోంటే పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. గత జనవరి 29వ తేదీన స్వామి వివేకానందనగర్‌లో కోర్టు ఉత్తర్వుల పేరిట 23 ఇళ్లను కూల్చేసిన విషయం విదితమే. అయితే ఆ రోజు నుంచి కూడా బాధితులు కూల్చివేసిన స్థలంలోనే టెంట్ వేసుకుని అక్కడే వండుకుంటూ తింటూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌తోపాటు వివిధ పార్టీలు, స్వచ్ఛందసంస్థలు బాధితులకు సోమవారం సంఘీభావం ప్రకటించి నిరసనల్లో పాల్గొన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కావడంతో ఆయను కలిసి వినతిపత్రం ఇవ్వడానికి బాధితులు బయలుదేరడంతో పోలీసులు అడ్డుకున్నారు.

ఈసారి కేంద్రంలో కాంగ్రెస్‌దే అధికారం

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి తీరుతుందని సీనియర్ కాంగ్రెస్ నేత బి.వేణుగోపాలస్వామి ధీమా వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి నారాయణగూడ హిమాయత్‌నగర్ మీదుగా బషీర్‌బాగ్ అమ్మవారి ఆలయం వరకు భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహించారు. కళాకారులు, మహిళలు పాల్గొన్నారు.

'రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి'

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని రూ.5వేల కోట్లలతో రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు నవల్ల సత్యనారాయణరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘాల ప్రతినిధులు బద్దురి వెంకటేశ్వరరెడ్డి, దామోదర్‌రెడ్డి, లింగారెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎల్‌హెచ్‌పీ' అక్రమాలపై విచారణ జరిపించాలి

బర్కత్‌పుర: భద్రాది కొత్తగూడెం జిల్లాలో ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల నియామకాల్లో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్రఅధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ కనుసన్నల్లో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఈ అక్రమాలు జరిగాయని, విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకొస్తాయని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

రాంనగర్: హిమాయత్‌నగర్ మండలం బాగ్‌లింగంపల్లిలోని భగత్‌సింగ్‌నగర్ బస్తీవాసులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సోమవారం హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

శ్రీవీరభద్రస్వామి ఆలయ ధర్మకర్తగా మల్లికార్జున్

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కురివి శ్రీవీరభద్రస్వామి, భద్రకాళి ఆలయ ధర్మకర్తగా కాచిగూడకు చెందిన కాసుల మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వవిప్ డాక్టర్ రాంచంద్రనాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కాచిగూడ సీఐగా లక్ష్మీకాంతరెడ్డి

బర్కత్‌పుర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుమండలం పరిధిలోని కాచిగూడ పీఎస్ నూతన సీఐగా లక్ష్మీకాంతరెడ్డి సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. బహదూర్‌పూర పీఎస్ డీఐగా పనిచేసిన లక్ష్మీకాంతరెడ్డిని కాచిగూడ సీఐగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ సీఐగా ఉన్న రామలక్ష్మణరాజును బదిలీ చేశారు.

8న హనుమాన్ ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 8న మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ మాచర్ల దేవనాథం తెలిపారు. ఆలయ ఆవరణలో ఉన్న శ్రీ శివాలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. వివరాలకు 9000983042, 8297907578 నెంబర్‌లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల వారి నుంచి ఉగాది పురస్కారాలు-2024 ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది ఆర్ట్స్ అకాడమీ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ స్థాపక అధ్యక్షులు లయన్ డా.ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 15వ తేదీలోపు దరఖాస్తులు పంపాలని, వివరాలకు 9652347207 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ముషీరాబాద్ సీఐగా ఆర్.నిరంజన్

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్.నిరంజన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సీఐ ఎన్.రవికుమార్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు. ముషీరాబాద్ పీఎస్‌లో అదనపు ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగుతున్న వెంకట్‌రెడ్డి టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శివలింగం వచ్చారు.

జిల్లా టెక్నికల్ స్టూడెంట్స్ కమిటీ కన్వీనర్‌గా వేమన

రాంనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా టెక్నికల్ స్టూడెంట్స్ కమిటీ కన్వీనర్‌గా వేమన నియమితులయ్యారు. సోమవారం ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా టెక్నికల్ స్టూడెంట్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కన్వీనర్, కో-కన్వీనర్లు, సభ్యులను ఎన్నుకున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణ

ముషీరాబాద్, అంబర్‌పేటలో ప్రారంభించిన ఎమ్మెల్యేలు గోపాల్, వెంకటేష్



కవాడిగూడ పూల్‌బాగ్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్‌ల ఆధునికీకరిస్తున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లుఆయన వివరించారు. కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ మునిసిపల్ క్వార్టర్స్ వద్ద రూ.12.5లక్షలు, పూల్‌బాగ్‌లో రూ.5.3లక్షలు, ఎల్ఐసీ కాలనీ వద్ద రూ.10లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు సోమవారం ఎమ్మెల్యే ముఠాగోపాల్ కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో ఆరు డివిజన్‌లలో పురాతన పైప్‌లైన్లను తొలగించి మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్, కార్పొరేటర్ పద్మ

నల్లకుంట, మార్చి4 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల వ్యవస్థ ఆధునికీకరణ, నూతన సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి పనులను కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్నామని చెప్పారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని తురాబ్‌నగర్, మల్లికార్జున్‌నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆ ప్రాంతాలలో ఎమ్మెల్యే పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు.